హైదరాబాద్ వార్త

ముషీరాబాద్‌లో ముక్కోణపు పోటీ

కలవర పెడుతున్న పార్టీ ఫిరాయింపులు

విజయంపై ఎవ్వరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

"మూడు ప్రధాన పార్టీలలో టిక్కెట్లు ఆశించి భంగపడ్డ నేతలు పార్టీలు ఫిరాయించడం కూడా అభ్యర్థులను ఒకింత ఆందోళనకు గురిచేస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనప్పటికీ గతంలో విజయం సాధించాం.. అభివృద్ధి చేశాం.. కాబట్టి ఇప్పుడు మాదే విజయం అని ధీమాతో ఉన్న కారుకు ముషీరాబాద్ ఓటర్లు బ్రేకు వేస్తారా? కర్నాటక విజయంతో జోష్ మీద ఉన్న కాంగ్రెస్ పార్టీకి చేయందిస్తారా.. చెయ్యిస్తారా? స్థానికుడిని, ప్రజల ఆదరణ నాకే ఉంటుంది అని ఆశిస్తున్న కమలం వికసిస్తుందా..? ముషీరాబాద్ ప్రజలు ఆదరించే నాయకుడు ఎవరు అనేది తెలియాలంటే ఎన్నికలు అయ్యేదాకా వేచి చూడాల్సిందే.

అంజన్‌కుమార్ యాదవ్ (కాంగ్రెస్)

ముఠాగోపాల్ (బిఆర్ఎస్)

పూసరాజు (బిజెపి)

ధర్నాచౌక్, నవంబర్ 4, ప్రభాతవార్త: ఎంతో రాజకీయ చరిత్ర ఉన్న ముషీరాబాద్ నియోజకవర్గంలో ఈసారి కూడా ముక్కోణపు పోటీ కొనసాగుతోంది. బీఆర్ఎస్ పార్టీ నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కాంగ్రెస్ నుండి మాజీ రాజ్యసభ సభ్యులు ఎం.అంజన్‌కుమార్ యాదవ్, బీజేపీ నుండి పూసరాజు బరి లో ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య, తెలంగాణ ప్రథమ హోంమంత్రి నాయిని నరసింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా, రెండు సార్లు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం రాజ్యసభ సభ్యునిగా కొనసాగుతున్న డాక్టర్ కే.లక్ష్మణ్ వంటి ఎంతో మంది రాజకీయ ఉద్ధండులకు అడ్డాగా ఉన్న ముషీరాబాద్ నియోజకవర్గంకు తెలంగాణ రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే ఎంతో ప్రాధాన్యత ఉంది. అన్ని వర్గాల వారు, అన్ని కులాల వారు మిళితమై ఉండే ఈ నియోజకవర్గంలో దాదాపు రెండు లక్షలా తొంభైఐదు వేల ఓటర్లు ఉన్నారు. నాయకులు ఎవరికి వారే మాదే విజయం అంటూ పైకి ధీమా ప్రదర్శిస్తున్నప్పటికీ, లోలోపల ప్రతి నాయకుడు గెలుస్తానా లేదా అని మధనపడుతూనే ఉంటారు అనటంలో ఎలాంటి సందేహం లేదు. ఇక్కడ ఓటర్ల నాడి ఎప్పుడు ఎలా మారుతుంది, ఎవరిని గెలిపిస్తారు అనేది ఊహించటం కష్టం. 2009 ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి టి.మణెమ్మను విజయం వరిస్తే, 2014లో బీజేపీ నుండి లక్ష్మణ్, 2019లో టీఆర్ఎస్ నుండి ముఠా గోపాల్ విజయం సాధించారు. అదే విధంగా 2016 జీహెచ్ఎంసీ ఎన్నికల సమయం లో ఇక్కడ ఎమ్మెల్యేగా డాక్టర్ లక్ష్మణ్ ఉన్నప్పటికీ ఆరింట ఐదు డివిజన్లలో టీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తే, 2020 లో అధికార పార్టీగా టీఆర్ఎస్ ఉన్నా, ఇక్కడ ఎమ్మెల్యే సైతం టీఆర్ఎస్ అయినప్పటికీ ఆరింట ఐదు డివిజన్లలో బీజేపీ కార్పోరేటర్లు విజయం సాధించటం విశేషం.

వాస్తవానికి ముషీరాబాద్ నియోజకవర్గం జనరల్ అయినప్పటికీ, ఇక్కడ బీసీలు అధిక శాతం ఉండటంతో బీసీ అభ్యర్థి అయితే విజయావకాశాలు ఎక్కువ అనే ఉద్దేశ్యంతో బీసీ అభ్యర్థులకే సీట్లు కేటాయిస్తుంటారు. అదే క్రమంలో 2023 ఎన్నికలలో సైతం గతంలో ఒకసారి ఓటమి పాలయి, ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్న గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన ముఠా గోపాల్‌కు బీఆర్ఎస్ టిక్కెట్టు ఇవ్వగా, గత ఎన్నికలలో రెండవ స్థానంలో నిలిచిన ఎం.అనిల్‌కుమార్ యాదవ్ కన్నా, ఆయన తండ్రి అంజన్‌కుమార్ యాదవ్ అయితే తప్పకుండా విజయం సాధిస్తారు అనే ఆశతో కాంగ్రెస్ అధిష్టానం అంజన్‌కుమార్ యాదవ్‌ను బరిలో దింపారు. మొన్నటి దాకా బీజేపీ అభ్యర్థి ఎవరా అని ప్రతి పక్షాలు సైతం ఎదురుచూస్తూ, దత్తాత్రేయ కూతురు బండారు విజయలక్ష్మికి ఇస్తారా లేక ఓసీ వర్గానికి చెందిన వ్యక్తికి ఇస్తారా అని ఊహాగానాలు సాగుతూ ఉండగా అందరి అంచనాలను తారుమారు చేస్తూ గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన పూసరాజుకు బీజేపీ అధిష్టానం టిక్కెట్టు కేటాయించారు.

చార్మినార్‌లో బిజెపిదే విజయం

యాకుత్‌పుర, నవంబరు 4 ప్రభాతవార్త : చార్మినార్ నియోజకవర్గంలో బిజెపి విజయం సాధిస్తుందని చార్మినార్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి మెఘారాణి అగర్వాల్ అన్నారు. చార్మి నార్ నియోజకవర్గం పరిధిలోని దారుషిఫా ప్రాంతంలో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి తెలంగాణ మైనార్టీ వ్యవహారాల ఇంఛార్జి షబానా మోమిన్, సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, అనిల్ బజాజ్, వేణు గోపాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

తాయిలాలు ఇస్తున్నారా.. జాగ్రత్త

ప్రచారంలో దూకుడు పెంచిన అభ్యర్థులు



హైదరాబాద్, నవంబరు 4 ప్రభాతవార్త : శాసనసభ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం ప్రారంభమవడంతో అభ్యర్థులు ప్రచారంలో దూకుడు పెంచారు. ఎన్నికల కోలాహలం మొదలైంది. ఇప్పటికే అభ్యర్థులు ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఎలాగైనా గెలుపొందాలని యోచిస్తున్నారు. కొందరు అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు విశ్వప్రయత్నాలు చేస్తుంటారు. అలాంటివారు ఎన్నికల చట్టం ప్రకారం శిక్షార్హులవుతారు. తాయిలాలు అందించేవారు పట్టుబడితే భారతీయ శిక్షాస్మృతి ప్రజాప్రాతినిధ్య చట్టం (రిప్రెజెంటేషన్ ఆఫ్ పీపుల్ యాక్ట్-1951, ఎక్సైజ్ చట్టం-1968) ప్రకారం అధికారులు కేసులు నమోదు చేస్తారు. బాధ్యత గల పౌరులు ఎన్నికల అధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తే బాధ్యులకు జరిమానాతో పాటు జైలుశిక్ష పడే అవకాశం ఉంది. ప్రతి అభ్యర్థి రూ.40లక్షలకు మించి వ్యయం చేయొద్దని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రోజువారీ ఖర్చు వివరాల సేకరణపై వ్యయ పరిశీలకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. అభ్యర్థులు నామినేషన్ క్రతువు దగ్గరి నుంచి ప్రచారం పూర్తయ్యే వరకు చేసే ప్రతి పనికి అయ్యే ధరల వివరాలను ఎన్నికల సంఘం విడుదల చేసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ధరలు వేర్వేరుగా ఉన్నాయి. నిర్ణీత ఖర్చు కంటే ఒక్క రూపాయి పెరిగినా సంబంధిత అభ్యర్థిపై చర్యలు తీసుకునేలా ఎన్నికల సంఘం ప్రణాళిక రూపొందించింది. అభ్యర్థులు చేసే ఖర్చుపై వ్యయ పరిశీలకులు నిరంతరం నిఘా పెడుతున్నారు. వ్యయ పరిశీలన బృందం ఖర్చు వివరాలను ఎప్పటికప్పుడు షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్ నమోదు చేసేలా చర్యలు తీసుకున్నారు. అభ్యర్థులు వ్యయం వివరాలను రెండు రోజులకోసారి సమర్పించాలని, లేకుంటే నోటీసులు అందించేలా ప్రణాళిక రూపొందించారు. అభ్యర్థులు వారి ప్రచార సమయంలో ఖర్చుకు సంబంధించి లెక్కలను సక్రమంగా నిర్వహించాలని, లేకుంటే చర్యలు తప్పవని వ్యయ పరిశీలకులు ఆదేశాలు జారీ చేశారు.

విద్వేషపూరితంగా ప్రసంగిస్తే.. విద్వేషపూరిత ప్రసంగాలు చేయరాదు. ఓ వర్గం ఓట్లను దక్కించుకునేందుకు కొన్ని చోట్ల అభ్యర్థులు విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తుంటారు. కులాలు, మతాలను కించపరిచినా, ఎదుటివారి మనోభావాలను దబ్బతీసేలా మాట్లాడినా ప్రజాప్రాతినిధ్య చట్టం (ఆర్‌పి యాక్ట్) 125 నిబంధన ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా ఉంటుంది. రెండు కూడా విధించవచ్చు. ఎవరూ మతాలు, వర్గాలను కించపరిచేలా మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడొద్దు. (ఆర్‌పి యాక్ట్-125) ప్రకారం మూడేళ్లు జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది.

మద్యం పంపిణి చేస్తే... ఓటర్లను ప్రలోభపెట్టేందుకు చాలామంది అభ్యర్థులు మద్యం పంపిణీ చేస్తుంటారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి మద్యం పంపిణి చేస్తుంటారు. పోలీసులు, అధికారుల తనిఖీల్లో అనుమతి లేకుండా పరి మితికి మించి మద్యం నిల్వ ఉంచుకున్నా, విక్రయించినా ఓటర్లకు పంపిణి చేసినా కేసు నమోదు చేస్తారు. ఓటర్లకు సారా, కల్లు, మద్యం, ఇతర మత్తు పదార్థాలు ఏవి ఇచ్చినా నేరమే అవుతుంది. అనుమతి లేకుండా మద్యం నిల్వ చేసినా, విక్రయించినా, ఓటర్లకు పంపిణి చేసినా శిక్షార్హులవుతారు. ఎన్నికల నియమావళి అమల్లోకి రాగానే పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. తనిఖీల్లో పట్టుబడితే ఎక్సైజ్ చట్టం-1968 సెక్షన్ -34(ఎ) ప్రకారం ఆరు నెలల నుంచి ఏడాది జైలుశిక్ష పడుతుంది. రూ.5వేల నుంచి 20వేల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

ఓటర్లకు డబ్బులు, కానుకలు పంచితే.. ఎన్నికల్లో గెలవడానికి అభ్యర్థులు ఓట్లను నోట్లతో కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తారు. ఓటర్లకు డబ్బులను పంపిణి చేసేటప్పుడు పట్టుబడితే ఐపీసీ 171(ఇ) ప్రకారం ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ప్రజా ప్రతినిధ్యం చట్టం ప్రకారం కూడా శిక్షలు అమలు చేస్తారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటర్లను ఆకర్షించడానికి కానుకలు అందించినా నేరమే. మహిళలకు చీరలు, గృహోపకరణాలు ఇవ్వడం, యువకులకు క్రీడా కిట్లు, సెల్‌ఫోన్లు ఇలా ఏవి ఇచ్చినా ఐపీసీ 171(ఈ) ప్రకారం ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారు.

దొంగ ఓట్లు వేస్తే అంతే.. ఎన్నికల్లో ఒకరి ఓటు మరొకరు వేస్తుంటారు. ఇలాంటి వాటినే దొంగ ఓట్లు అంటారు. తర్వాత వచ్చిన అసలు ఓటరు తన ఓటు ఎవరో వేశారని తెలిసి అవాక్కవుతారు. ఇలా దొంగ ఓట్లు వేయించినా, వేసినా చట్ట ప్రకారం నేరం. ఐపీసీ 171(ఎఫ్) ప్రకారం ఏడాది జైలుతో పాటు జరిమానా విధిస్తారు. పోలింగ్ సమయంలో ఒకరి ఓటు మరొకరు ఉద్దేశపూర్వకంగా వేస్తున్నట్లు ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు అందితే కేసు నమోదు చేస్తారు. ఒకవేళ ముందే పోలింగ్ కేంద్రంలో ఏజెంట్లు పసిగట్టి అధికారులకు తెలియజేస్తే అక్కడే దొరికిపోతారు.

భూకబ్జాదారుల నుంచి రక్షించండి

ప్రభుత్వానికి ఓ బాధితురాలు విజ్ఞప్తి

హైదరాబాద్, నవంబర్ 4,ప్రభాతవార్త: తనభూమిని కబ్జాచేసి, తనను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకుని తనను రక్షించాలని ఎస్ఆర్‌నగర్‌కు చెందిన భాదితురాలు చింతపల్లి రేణుక ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తనభర్త రవీందర్ 1995లో అత్తాపూర్ మష్కమహాల్ వద్ద కొంత ఖాళీ స్థలాన్ని కొనడం జరిగిందని తెలిపారు. సంబంధింత భూమిని అప్పుడే హుడా సరిహద్దు గోడలు నిర్మించి తమకు అప్పజెప్పడం జరిగిందన్నారు. తదనంతరం 2005లో తనభర్త మరణించడంతో ఇద్దరు పిల్లల యోగక్షేమాలు చూసుకుంటూ జీవిస్తునానన్నారు. ఇటీవల కొంతమంది వ్యక్తులు దౌర్జన్యంగా సరిహద్దులు పగలగొట్టి జెసిబితో గుంతలు తీసి డ్రైనేజీ పైప్‌లైనున్ల వేస్తున్న సమాచారం అందిందని ..వెంటనే తమబంధువులతో కలిసి అక్కడి వెళ్ళి వారిని ప్రశ్నించగా వారు నానాబూతులు మాట్లాడుతూ భౌతిక దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేశారన్నారు. ఈవిషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని కావున అక్కడ రౌడీయిజం చేస్తున్న బసవరాజు, సిద్దార్థ్, చంద్రశేఖర్ లతో పాటు స్థానికంగా వారిని సపోర్టు చేస్తున్న ఓ రాజకీయ నాయకుడిపై కూడా వెంటనే చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సికింద్రాబాద్‌ను అభివృద్ధి చేసిన ఘనత మాదే

డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

చిలకలగూడలో పాదయాత్ర చేస్తున్న పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, నవంబర్ 4 ప్రభాతవార్తః సికింద్రాబాద్ పరిధిలో అన్ని వర్గాల ఆధరణ తమకే ఉందని, ప్రజలతో నిరంతరం సంబంధాలు, అనుబంధాలను కొనసాగిస్తున్నామని డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మారావు గౌడ్ అన్నారు. నియోజకవర్గం పరిధిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని చిలకలగూడ బడీ మసీద్ ఏరియా, చోటీ మసీద్, ఎరుకలబస్తీ, కిందిబస్తీ, భవానినగర్, అన్నానగర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం జరిపారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ఉపకరించే కార్యాక్రమాలను చేపట్టామని తెలిపారు. ఓటర్లు తమను ఆశీర్వదిస్తున్నారని చెప్పా రు. ప్రజా సమస్యలపై నిరంతరం శ్రమించిన తమకే ప్రజల నుంచి ఓట్లుఅడిగే నైతిక హక్కు ఉందన్నారు.

నన్ను గెలిపించే బాధ్యత మీదే

ఇంటింటి ప్రచారంలో కాలేరు వెంకటేష్

గోల్నాకలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన బిఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్‌కు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

హైదరాబాద్, నవంబరు 4 ప్రభాతవార్త : ప్రజల బాధలన్నీ తీర్చానని, ఎన్నికల్లో మరోసారి గెలిపించే బాధ్యత మీదేనని అంబర్‌పేట బిఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం గోల్నాక డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు శాలువాలు కప్పి మంగళహారతులతో స్వాగతం పలికారు. బస్తీల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని, సమస్యల పరిష్కారానికి కృషిచేసిన కారు గుర్తుకే ఓటేస్తామని ముక్తకంఠంతో నినదించారు. ఈ సందర్భంగా కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ కొందరు ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వస్తారని..తాను మాత్రం నిత్యం ప్రజలలోనే ఉంటాననే విషయం అందరికీ తెలుసునన్నారు.

కాలేరు సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన మహమ్మద్ ముస్తఫా ఆలీ.. బిఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ సమక్షంలో గ్రేటర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫా అలీ బిఆర్ఎస్‌లో చేఱరు. సిఎం కెసిఆర్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి, అంబర్‌పేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై గోల్నాక డివిజన్ సుందర్ నగర్‌కు చెందిన మహమ్మద్ ముస్తఫా ఆలీ గులాబి కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ ముస్తఫా అలీకి పార్టీలో తగిన గుర్తింపు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ మహమ్మద్ కబీర్, సయ్యద్ సలీం, అడ్వకేట్ సయ్యద్ పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో బిజెపి నాయకుల నిరాహారదీక్ష

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 4, ప్రభాతవార్త : తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా భారతీయ జనతా పార్టీ జనసేన పార్టీతో పొత్తు పెట్టుకున్న నేపథ్యంలో కూకట్‌పల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన టికెట్ ఖచ్చితంగా బిజెపి అభ్యర్థికే ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతూ శనివారం యువ మోర్చా, మహిళా మోర్చా ఆధ్వర్యంలో కూకట్‌పల్లి అసెంబ్లీ బిజెపి కార్యాలయం వద్ద నిరాహారదీక్ష చేపట్టారు. ఈ దీక్షకు మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి పాల్గొని సంఘీభావం తెలుపుతూ కూకట్‌పల్లి టికెట్ భారతీయ జనతా పార్టీకి ఇవ్వాలని అధిష్టానాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, అద్వానీ సూర్యారావు, సూర్యప్రకాష్ రావు, శ్రీకర్‌రావు, శంకర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హస్తం పేదలకు నేస్తం

ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయారెడ్డి

ప్రచారంలో పాల్గొన్న విజయారెడ్డి

ఫిల్మ్‌నగర్, నవంబర్ 4, ప్రభాతవార్త : కాంగ్రెస్ హస్తం పేదలకు నేస్తమని, నీళ్ళు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ కేవలం ఒకే కుటుంబానికి పరిమితమైపోయిందని, తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, రోజు రోజుకు కాంగ్రెస్‌కు అమితమైన ఆదరణ లభిస్తోందని ఖైరతాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.విజయారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పద్మాలయ అంబేద్కర్ నగర్, ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల కార్డును ప్రజలకు వివరిస్తూ ఖైరతాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.విజయారెడ్డి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయా రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, 200 యూనిట్ల వరకు కరెంట్ ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలోని మాజీ కార్పోరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేషన్ వేసిన రాజేంద్రనగర్ బిజెపి అభ్యర్థి తోకల

నామినేషన్ వేసేందుకు ఆర్.ఓ కార్యాలయంలోకి వెళ్తున్న రాజేంద్రనగర్ బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి

నార్సింగి, నవంబర్ 4 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ ఆర్.ఓ కార్యాలయంలో శనివారం బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి తొలి సెట్ నామినేషన్ వేశారు. తోకల తన అను చరగణంతో జైశ్రీరాం... జైజై శ్రీరాం అంటూ పెద్ద పెట్టున నినాదలు చేస్తూ, భారీ ర్యాలీతో ఉప్పరిపల్లిలోని ఆర్.ఓ కార్యాలయంకు వచ్చి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ నాపై ఎంతో నమ్మకం ఉంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇచ్చిందని, ఈ ఎన్నికల్లో విజయం సాధించి పార్టీ పెద్దలకు తొలి గిఫ్ట్‌ను అందజేస్తానని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ సర్కారు చేసిన ప్రజా వ్యతిరేఖ విధానాలను, కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కారు సమర్థవంతంగా అమలు చేసిన సంక్షమాభివృద్ధి పతకాలు గడప గడపకు తీసుకెళ్లి ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకుంటానని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటర్లే బాస్‌లని, ఓటు హక్కు వచ్చిన ప్రతీ ఒక్కరూ తప్పకుండా ఓట్లు వేసి, సమర్థులైన నాయకులను చట్ట సభలకు పంపించాలన్నారు. ఓటర్లు ఓటు వేయకపోతే అసమర్థులు రాజ్యమేలే ప్రమాదం ఉందన్నారు. రెండో సెట్‌ను 9.వ,తేదీన వేస్తానని, రాజేంద్రనగర్ ఓటరు దేవుళ్లంతా మార్పు కోసం నన్ను అసెంబ్లీకి పంపించాలని కోరుతున్నానని తోకల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో కార్తీకమాస పవిత్రోత్సవాలు

చిక్కడపల్లి, నవంబరు 4 ప్రభాతవార్త: వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో కార్తీకమాస పవిత్రోత్సవాలను 14వ తేదీ నుంచి డిసెంబరు 12వ తేదీ వరకు నిర్వహించబోతున్నట్లు ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ బాసాని పద్మాసూర్యప్రకాశ్, ఈవో మాచ్ల దేవనాథం వివరించారు. కార్యక్రమం వివరాలు వెల్లడించారు. 20న, 27, డిసెంబరు 4న సాయంత్రం ప్రదోషకాల పూజ, 24న కృష్ణతులసి కళ్యాణం, 25న శనితిలతైలాభిషేకాలు, 26న జ్వాలాతోరణం-సహస్ర దీపాలంకరణం, 30న ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు రుద్రహోమం, డిసెంబరు 11న సాయంత్రం శివకళ్యాణం మహోత్సవం ఉంటుందన్నారు. ప్రతి రోజు ఉదయం 7 గంటలకు మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు, ఉదయం 9 గంటలకు ఏకవార రుద్రాభిషేకాలు, సాయంత్రం ఆకాశ దీపోత్సవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయం ధర్మకర్తలు మురికి గణేష్, డాక్టర్ టి.రామకృష్ణ, ముఖ్య అర్చకులు బుగ్గలక్ష్మీపతిశర్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలంటే పోటీతత్వం ముఖ్యం

బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెంల గోపీచంద్

హైదరాబాద్, నవంబర్ 4,ప్రభాతవార్త: క్రీడల్లో రాణించాలంటే పోటీతత్వం అనేది చాలా ముఖ్యమని ..దీనికోసం ఇంకా ఈవెంట్లను నిర్వహించి క్రీడాకారుల మధ్యపోటీతత్వం పెంచాని బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెంల గోపీచంద్ అన్నారు. ఈమేరకు శనివారం నగరం జరిగిన విలేకరుల సమావేశంలో గోపిచంద్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఆల్ట్రా రన్నర్స్ మారథాన్ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వడం గర్వకారణమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అల్ట్రారన్నర్స్ ఈమారథాన్‌లో భాగస్వాములవబోతున్నారని ఇది భారత క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. ఇక్కడ మూరథాన్ జరగటానికి ఏఎఫ్ఐ (అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా), ఐఏయు(ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఆల్ట్రా రన్నర్స్)సంస్థలు కృషి చేశాయని తెలిపారు. ఐఏయు ప్రెసిడెంట్ నదీంఖాన్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం గచ్చిబౌలిలో 7గంటలనుంచి 10వరకు జరిగే 50కిలోమీటర్ల ఈఅల్ట్రా మారథాన్‌లో 22దేశాలకు చెందిన సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఐఏయు, ఏఎఫ్ఐ సహకారంతో ఎన్ఈబి స్పోర్ట్స్ నిర్వహిస్తున్న ఈ 50కి.మీ వరల్డ్ ఛాంపియషన్‌షిప్, హాఫ్ మారథాన్ కూడా నిర్వహిస్తున్నామన్నారు.

మరొక్కసారి అవకాశం ఇవ్వండి, కూకట్‌పల్లిని అగ్రగామిగా నిలుపుతా

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, నవంబర్ 4, ప్రభాతవార్త : ఎమ్మెల్యేగా తనకు మరొక్కసారి అవకాశం ఇస్తే కూకట్‌పల్లిని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుపుతానని కూకట్‌పల్లి బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పోరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి శనివారం బాలానగర్ డివిజన్‌లోని వివిధ కుల సంఘాలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా చిత్తారమ్మ డబుల్ బెడ్ రూమ్, ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్, విశ్వకర్మ సంఘం, భవన నిర్మాణ సంఘం సీనియర్ సిటీజన్స్, నాయి బ్రాహ్మణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలానగర్ వాసులు పడుతున్న ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టే విధంగా 400కోట్ల రూపాయలతో ఫ్లైఓవర్ నిర్మాణం చేశామని అన్నారు. అత్యధిక శాతం పరిశ్రమలు ఉన్న బాలానగర్ ప్రాంతంలో ఒకప్పుడు విద్యుత్ సమస్యతో కార్మికులకు ఉపాధిలేక అల్లాడిపోయేవారని కానీ నేడు ఆ పరిస్థితి లేదన్నారు. దాదాపు 24గంటలు విద్యుత్ అందిస్తూ అటు పరిశ్రమలు యజమానులకు ఇటు కార్మికులకు ఇబ్బంది లేకుండా చేసిన ఘనత తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌దేనని అన్నారు. అందుకనే మన తెలంగాణ రాష్ట్రం ఆదర్శ రాష్ట్రంగా నిలుస్తుందని, పక్కనున్న కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత నేడు ఎన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయో అర్థం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏనుగుల తిరుపతి, శకయ్య సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ నగరాన్ని దేశానికి రెండో రాజధానిగా చేస్తాం

అభివాదం చేస్తున్న నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నేతలు

సైఫాబాద్, నవంబరు 4 ప్రభాతవార్త: తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి వస్తే హైదరాబాద్ నగరానికి దేశానికి రెండో రాజధానిగా చేస్తామని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్ చెప్పారు. నదులను అనుసంధానం చేసి, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల ను పూర్తి చేస్తామని, వ్యవసాయానికి, తాగడానికి పుష్కలంగా నీరు అందిస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని తెలుగు ప్రజలంతా ఐక్యంగా ఉండి ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి ఓట్లు వేసి అత్యధిక మేజార్టితో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో పలువురు అభ్యర్థులకు ఆయన బీ-ఫామ్‌లను అందజేసిన సందర్భంగా మాట్లాడారు. ఆదానీ, అంబానీలకు ఊడిగం చేస్తున్న బిజెపిని తెలంగాణ నుంచి తరమికోట్టాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు షేక్ బాబర్, ఖలీమ్ ఉద్ధీన్, సయ్యద్ సైదా, మల్లిక రేవతి, శంకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తా : ఆదం సంతోష్‌కుమార్

ప్రచారంలో ఓటర్లకు నమస్కరిస్తున్న ఆదం సంతోష్‌కుమార్

తార్నాక, నవంబర్ 4 ప్రభాతవార్త: నియోజక వర్గం బిడ్డగా స్థానికుడినైన నన్ను ఆదరించిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్ కుమార్ పేర్కొన్నారు. తార్నాక డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా పర్యటించి ప్రచారం చేశారు. ఇసుక బావి, చంద్రబాబు నాయుడునగర్, లక్ష్మీనగర్, సత్యనగర్ తధితర ప్రాంతాల్లో కాంగ్రెస్ ఇచ్చి ఆరు గ్యారంటీలను వివరిస్తూ ప్రచారం చేశారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీడీ అమర్ నాథ్ గౌడ్, గణేష్ యాదవ్, ఎల్ఎల్‌బీ శ్రీనివాస్,రాంలాల్, కిషోర్ యాదవ్, రవి, కిట్టు, హరి, శైలెందర్, బ్రహ్మజీ,సత్యనారాయణ, హన్మంతు, లాజరస్, ఆలకుంట లింగయ్య, పవన్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పన్నీరు మమతకు బంగారు పతకం

హైదరాబాద్ నవంబరు 4 ప్రభాతవార్త : ఉస్మానియా విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేట్ కళాశాల విద్యార్థిని పన్నీరు మమత లైబ్రరీ అండ్ ఇన్‌ఫర్మేషన్ సైన్స్, పోస్టు గ్రాడ్యుయేట్ విభాగంలో ఉస్మానియా వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, అడోబ్ సీఈవో శంతన్ నారాయణ్, వైస్‌చాన్స్‌లర్ రవీందర్ చేతులమీదుగా బంగారు పతకాన్ని స్వీకరించారు. పన్నీరు మమత మాట్లాడుతూ లైబ్రరీ అండ్ ఇన్‌ఫర్మేషన్ సైన్స్, పోస్టు గ్రాడ్యుయేట్ విభాగంలో బంగారు పతకం సాధించడం చాలా సంతోషంగా ఉందని, ఇదే ఉత్సాహంతో ఈ విభాగంలో పిహెచ్‌డి కూడా పూర్తి చేస్తానని అన్నారు. గజ్వేల్ జగదేవ్‌పూర్‌కు చెందిన పన్నీరు నర్సింహులు-సుజాత కుమార్తె అయిన మమత సైదాబాద్ పూసలబస్తీకిచెందిన మద్దిబోయిన సత్యనారాయణ-విమల దంపతుల కుమారుడు శ్రీకాంత్‌ను వివాహం చేసుకుంది. వివాహం తర్వాత తన విద్యాభ్యాసం కొనసాగించి బంగారు పతకం గవర్నర్ చేతులమీదుగా సాధించడం గర్వంగా ఉందని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తంచేశారు.

ప్రకాశ్‌గౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుందాం

నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ దారుగుపల్లి రేఖ యాదగిరి

నార్సాంగి మున్సిపాలిటీ పరిధిలో బిఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్‌ను గెలిపించాలని ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రేఖ యాదగిరి

నార్సింగి, నవంబర్ 4 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ బిఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుందామని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ దారుగుపల్లి రేఖ యాదగిరి పిలుపునిచ్చారు. శనివారం నార్సింగి మున్సిపల్ పరిధిలోని గౌలిదొడ్డి, వివేకానందనగర్ కాలనీ ప్రాంతాలలో జోరుగా ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 15.ఏళ్ల నుంచి రాజేంద్రనగర్ నియోజకవర్గంను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేసిన ప్రకాశ్‌గౌడ్‌కు అండగా నిలుద్దామని పేర్కొన్నారు. ఏనాడు ప్రజల ఇబ్బందుల గురించి నోరు విప్పని ప్రతిపక్షాలు ఎన్నికల వేళ ఓట్లు అడిగేందుకు వస్తున్నారని, ఓటరు దేవుళ్లు తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. బిఆర్ఎస్ సర్కారు చేసిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలతో లబ్దిపొందిన ప్రజానికం అంతా బిఆర్ఎస్‌కే ఓట్లు వేస్తామని భరోసా ఇస్తున్నారని రేఖ యాదగిరి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదయ్య, సంతోష్, శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ ప్రచారం

ప్రచారం నిర్వహిస్తున్న బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 4, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఫతేనగర్ డివిజన్ ఇందిరగాంధీపురంలో అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ శనివారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ముందుగా కాలనీకి ఇందిరాగాంధీ పేరు పెట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇందిరాగాంధీపురం కాంగ్రెస్ అడ్డా అంటున్న స్థానిక కాలనీ వాసులు అందరూ ఏకగ్రీవంగా పెద్దసంఖ్యలో సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు బస్తీలో హస్తం మన నేస్తం కాంగ్రెస్ పార్టీకే ఓటు మన అంటూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ త్యాగమూర్తులను ఒప్పించి మెప్పించి మన రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు రేవంతన్న అందించిన 6 గ్యారెంటీల పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే బస్తీవాసుల సమస్యలు చాలా ఉన్నాయని, మిషన్ భగీరథ నీళ్ళు ఎక్కడని, పెన్షన్ ఇంకా చాలా మందికి రాలేదని, ఇళ్ళ పట్టాల జాడేలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పాదయాత్ర కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు రమేష్, జ్యోతి, శాంతి, వినయ్, కిరణ్, రమేష్‌బాబు, రాజు ముదిరాజ్, ఇసుప్‌బాయ్, అజీద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలు నరకానికి సోపానాలు : ఎసిపి జి.శంకర్‌రాజు

నాంపల్లి, నవంబరు 4 ప్రభాతవార్త : ట్రాఫిక్ ఉల్లంఘనలు, రవాణా చట్టాలను పాటించకపోవడం, రహదారి నిబంధనలు పాటించకపోడం, వాహనాల నడుపుతున్నప్పుడు నిర్లక్ష్యం, మద్యం సేవించి నడపడం, మొత్తంగా ట్రాఫిక్ నియమనిబంధనలపై అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యం నరకానికి సోపానాలు మారుతూ రహదారులు రక్తసికమై ఎంతోమంది తమ, ఎదుటివారి విలువైన ప్రాణాలను హరించివేయడం, కుటుంబాలు కకలావికలం కావడం సర్వసాధారణమై పోయిందని రహదారి దుర్ఘటనలు ప్రతీ సంవత్సరం పెరిగిపోతూనే ఉన్నాయని, అందులో ఎక్కువశాతం యువత ఉండడం శోచనీయమని రెడ్‌హిల్స్‌లో కాలేజీ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ట్రాఫిక్ నిబంధనలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఏసిపి ట్రాఫిక్ టిటిఐ జి.శంకర్‌రాజు ఆవేదన వ్యక్తపరిచారు. 2005-22 మధ్యలో దేశీయంగా రోడ్డుప్రమాదాల్లో 24.78లక్షలమంది మరణించారని, మరో 86లక్షల మందికిపైగా క్షతగాత్రులయ్యారని, రోడ్డుప్రమాదాల్లో ఉత్తరప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర తొలి మూడుస్థానాల్లో ఉండగా తెలంగాణ 10వస్థానంలో ఉందన్నారు.

ప్రజా ఆశీర్వాద సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

నిజాంపేట్, నవంబర్ 4, ప్రభాతవార్త : భారత రాష్ట్ర సమితి ప్రజా ఆశీర్వాద సమావేశాలలో భాగంగా శనివారం బిఆర్ఎస్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కెపి వివేకానందగౌడ్, మేయర్ కోలన్ నీలా గోపాల్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా విచ్చేసి డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఫ్లోర్‌లీడర్ కార్పోరేటర్ ఆగం పాండు ముదిరాజ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్‌లతో కలిసి ప్రగతినగర్ 25వ డివిజన్ పరిధిలో ఎన్‌టీఆర్ పార్క్ వద్ద 26వ డివిజన్ కార్పోరేటర్ రాఘవేంద్రరావు, స్థానిక డివిజన్ బిఆర్ఎస్ ప్రెసిడెంట్ ఆవుల ఎల్లయ్య, ఆల్విన్ మాజీ ఎంప్లాయిస్, సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ పార్టీ ప్రజా ఆశీర్వాద సమావేశంలో పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని పలువురు సీనియర్స్, యువకులు, మహిళలు భారీగా బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మేయర్ కండువా కప్పి పార్టీలో స్వాగతించారు. ఈ మేరకు స్థానిక ప్రజలు ఏకగ్రీవంగా తమ మద్దతు ఎమ్మెల్యే వివేకానందకే ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఎన్ఎంఆర్ బిఆర్ఎస్ అధ్యక్షులు, ఆయా డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

119 స్థానాలకు జనరాజ్యం పార్టీ పోటీ

సైఫాబాద్, నవంబరు 4 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో 119 స్థానాలకు తమ పార్టీ పోటీ చేస్తుందని జనరాజ్యం పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎల్.అశీర్వాదం చెప్పారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పార్టీకి సంబంధించిన ఎన్నకల ప్రణాళిక కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో విద్యార్థులందరికి ఉచితంగా డిజిటల్ విద్యను అందిస్తామన్నారు. కళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, అక్రమాలపై సుప్రీంకోర్టుకు వెళతామన్నారు. ఈ ప్రాజెక్టు అవినీతిపై బిజెపి ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నవీన్‌రాజు, సివి సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, విఠల్‌రావు, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

జనార్ధన్ రెడ్డితో సమావేశమైన లాస్య నందిత

కంటోన్మెంట్,నవంబర్ 4 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత బారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని మాజీ ఎమ్మెల్సీ కనుకుల జానర్ధన్ రెడ్డి దీమా వ్యక్తం చేశారు. ఇటీవల కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్ధన్‌రెడ్డిని శని వారం బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఎన్నికల్లో తమను గెలిపించేందుకు సహకరించాలని లాస్య విజ్ఞప్తి చేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి లాస్య విజయానికి తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కనుకుల తిరుపతిరెడ్డి, యుగంధర్ రెడ్డి, దివంగత ఎమ్మెల్యే సాయన్న సతీమణి గీతా,నివేదితలు

నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

అవగాహన సదస్సులో పాల్గొన్న ప్రజలు

కొంపల్లి, నవంబర్ 4, ప్రభాతవార్త : ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు శనివారం కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ, సెంట్ మార్టిన్స్ కాలేజ్ ప్రాంతాలలో ప్రతి ఓటరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకోవాలని స్వీప్ ఆక్టివిటీస్ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. 80 ఏళ్ళు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు వేయవచ్చునని, ఇలాంటి వారిని గుర్తించి బ్యాలెట్ ఓటింగ్ పద్ధతి గురించిన అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ సురేష్‌రెడ్డి, ఎంఈపిఎంఏ కో ఆర్డినేటర్ జె.పద్మావతి, బిల్ కలెక్టర్ జి.నందా కుమార్, అప్పలరాజు, మున్సిపల్ సిబ్బంది, రెసోర్స్‌పర్సన్, డ్వాక్రా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో గెలుపే లక్ష్యంగా మహిళలు ఇంటింటికి ప్రచారం నిర్వహించాలి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి

మాట్లాడుతున్న బంగారు శ్రుతి, అభ్యర్థి మేకల సారంగపాణి

తార్నాక, నవంబర్ 4 ప్రభాతవార్త: సికింద్రాబాద్ నియోజక వర్గంలో బిజేపీ గెలుపే లక్ష్యంగా మహిళలు ఇంటింటికి ప్రచారం నిర్వహించాలని బిజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి పిలుపు నిచ్చారు. తార్నాకలోని మర్రి కృష్ణారెడ్డి హాల్లో బిజేపీ సికింద్రాబాద్ నియోజక వర్గం మహిళా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కార్యదర్శి బంగారు శృతి మాట్లాడుతూ ప్రధాని మోది మహిళలు ఆత్మ గౌరవంతో ఉండేందుకు ఎన్నో కార్యక్రమాలను చేపట్టారని కొనియాడారు. మహిళలందరు ఐకమత్యంతో ఉండి సికింద్రాబాద్ అభ్యర్థి మేకల సారంగపాణి గెలుపుకోసం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించాలని కోరారు. ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేస్తున్న మేకల సారంగపాణిని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్రి రాజశేఖర్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి అనిత, అధికార ప్రతినిధి శారద మల్లేష్, అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, మహిళా మోర్చ జిల్లా కార్యదర్శి అనుష, నాగమల్లేశ్వరీ, డివిజన్ అధ్యక్షురాలు సత్యవతి, భానుమతి, సరోజ,శోభ, కళావతి, మేకల కీర్తీ, దుర్గా, మేకల సుజాత, కనకట్ల హరి, సుక్క గణేష్ ముదిరాజ్, పోచయ్య యాదవ్, రాము వర్మ, వెంకటేష్ గౌడ్, జమ్మికుంట వేణు, ప్రకాష్ గౌడ్, ఆకుల శ్రీనివాస్, శషితో పాటు పలువురు పాల్గొన్నారు.

బాలరత్న అవార్డుల ప్రదానం

చిక్కడపల్లి, నవంబరు 4 ప్రభాతవార్త: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రథమ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ జయంతి సందర్భంగా బాలరత్న అవార్డులను ప్రదానం చేయబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధినేత్రి భారతీ కమలాకర్ వివరించారు. అవార్డుల కోసం బాలలకు వివిధ రంగాలలో ప్రతిభగల బాల కళాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు.

అంబర్‌పేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం రోహిన్‌రెడ్డి

అంబర్‌పేటలో ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 4 ప్రభాతవార్త : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి అంబర్‌పేట లో పర్యటించారు. శనివారం పలు బస్తీల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. ఓటర్లను అప్యాయంగా పలకరిస్తూ ప్రచారం కొనసాగించారు. అనంతరం మధ్యాహ్నం బర్కత్‌పురలోని తన నివాసంలో రోహిన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అంబర్‌పేటలో తన ఎన్నికల ప్రచారంలో ప్రజల స్పందన బాగుందన్నారు. ప్రజలు అధికార పార్టీపైన, స్థానిక ఎమ్మెల్యేపైన కోపంగా ఉన్నారని, డబుల్ బెడ్‌రూమ్‌లు, దళిత బంధ్, బిసి బంధ్, రేషన్‌కార్డులు, పనిచేయని ఆరోగ్యశ్రీ, నిరుద్యోగం వంటి సమస్యలతో ప్రజలు బిఆర్ఎస్‌పై ఆగ్రహంగా ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలకు నెలా నెలా రూ.2500 ఇస్తామని, గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే అందజేస్తామని, బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని కాంగ్రెస్ హామీలను పునరుద్ఘాటించారు. ఇచ్చిన మాటని నిలబెట్టుకునే ట్రాక్ రికార్డు కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు.బిఆర్ఎస్, బిజెపి ఒక్కటేనని, ఈ రెండు పార్టీలు కుమ్మక్కై పరిపాలన సాగిస్తున్నాయని విమర్శించారు. అంబర్‌పేటలోనే కాదు రాష్ట్రంలోనే బిజెపి తమకు పోటీ కాదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్‌గౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పార్టీ కోసం పని చేసిన సీనియర్లకు టిక్కెట్ ఇవ్వాలి

సమావేశంలో పాల్గొన్న సీనియర్ బిఆర్ఎస్ నాయకులు

చార్మినార్, నవంబరు 4 ప్రభాతవార్త : చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీని తప్పించి పార్టీ కోసం ఎన్నో ఏళ్ల నుంచి పని చేస్తున్న సీనియర్ నాయకులకు పార్టీ అధిష్టానం టిక్కెట్ ఇవ్వాలని పలువురు సీనియర్ బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో సీనియర్ బిఆర్ఎస్ నాయకులు మహ్మద్ ఇలియాజ్ ఖురేషీ,ఎస్.వి.గోపీనాథ్ యాదవ్,మొగల్‌పుర డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు పుప్పాల రాధాకృష్ణలు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం నెల రోజుల క్రితం మహ మ్మద్ సలావుద్దీన్ లోధీని చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిందని,కాని ఇంత వరకు లోధీ మాత్రం కార్యకర్తలను పట్టించుకోలేదని,ఇతని వ్యవహారి శైలి వల్ల చార్మినార్‌లో పార్టీ చాలా బలహీనమవ్వటంతో పాటు చాలా మంది నాయకులు పార్టీకి దూరమయ్యారని తెలిపారు. .ఈ విలేకర్ల సమావేశంలో సీనియర్ బిఆర్ఎస్ నాయకులు ఎస్.వి.గోపీనాథ్ యాదవ్,పురానాపూల్ డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ పెండ్యాల లక్ష్మణరావు,సీనియర్ బిఆర్ఎస్ నాయకులు జి.గోపీగౌడ్,మణికొండ విజయ్ కుమార్,గడ్డం సత్యనారాయణతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి అపూర్వ భవిష్యత్తు

నాంపల్లి, నవంబరు 4 ప్రభాతవార్త : తెలుగు సాహిత్యానికి యువతరాన్ని అందించాలన్న సంకల్పంతో తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో మొదటిసారిగా నిర్వహించిన యువ రచయిత్రుల సమ్మేళనానికి విశేష స్పందనతో వివిధ ప్రాంతాలలకు చెందిన 170మంది యువ రచయిత్రులు, కవయిత్రులు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. ఇప్పటికే రచనలు చేస్తున్నవారు కవిత్వం, కథలు వ్రాయాలన్న సంకల్పం, అభిరుచి కలిగిన వారు, ముఖ్యంగా పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాల ఔత్సాహిక విద్యార్థినులు అధికసంఖ్యలో పాల్గొనడం అద్వితీయం, అపూర్వంగా నిలిచింది. 2రోజుల సమ్మేళనం ప్రారంభోత్సవలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసంలో మనచుట్టూ ఉన్న జీవితాల్లోంచి వచ్చిన రచనలే సజీవమైనవని, రచనా నైపుణ్యం పెంపొందించే విధంగా అనేక అధ్యయన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ ప్రపంచ సాహిత్యంలోని పలువురు రచయితలను, రచనలను ఉటంకిస్తూ యువ రచయిత్రులకు గొప్ప ప్రేరణ కలిగించారు.

బిఆర్ఎస్ పార్టీలో చేరిన బండారి వెంకటేష్

మెహిదీపట్నం, నవంబర్ 4, ప్రభాతవార్త : తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారి వెంకటేష్ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆపార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయనకు పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బండారి వెంకటేష్ మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని, ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతుండడంతోనే బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నామని తెలిపారు. ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి కేసీఆర్ కట్టుబడి ఉన్నారని, బిఆర్ఎస్ పార్టీలోనే ముదిరాజ్‌లకు న్యాయం జరుగుతుందన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తున్న బిఆర్ఎస్‌కే మా మద్దతు

గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ బంజారా

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న వెంకట్ బంజారా, ఇందల్ రాథోడ్

హైదరాబాద్, నవంబర్ 4,ప్రభాతవార్త: సిఎం కెసిఆర్‌తోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమని గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో మద్దతిచ్చి గెలిపించుకుంటామని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ బంజారా అన్నారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాభైఏళ్లుపాలించిన కాంగ్రేస్ ప్రభుత్వం లంబాడీలకు చేసిందేమీలేదన్నారు. పైగా గిరిజనులను చిన్నచూపు చూస్తూ పిసిసి ఛీఫ్ రేవంత్‌రెడ్డి అవమానిస్తున్నారన్నారు. ఇటీవల లంబాడీలను అవమాని స్తూ వెయ్యిరూపాయలు, మందుబాటిల్ ఇస్తే ఓట్లేస్తారని వ్యాఖ్యానించారని ఈఎన్నికల్లో తమ సత్తా ఎంటో చూపిస్తామన్నారు. సిఎం కెసిఆర్ అధికారంలోకి వచ్చిన ఈపదేళ్లలో గిరిజ నుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని.. ముఖ్యంగా తండాలను గ్రామపంచా యితీలుగా మార్చడంతోపాటు 6శాతం ఉన్న రిజర్వేషన్లను 10శాతానికి పెంచారన్నారు. ఈసమావేశంలో జాతీయ అధ్యక్షులు ఇందల్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి రోమిత్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ నాయక్, ఉపాధ్యక్షులు శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హౌజింగ్ బోర్డు యూనిట్ కార్యవర్గం ఏకగ్రీవం

టిఎన్‌జిఓ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ముజీబ్‌హుస్సేనీ,క్వాదర్శి విక్రమ్ లను సన్మానిస్తున్న దృశ్యం

బేగంబజార్, నవంబర్ 4ప్రభాతవార్త: హౌజింగ్ బోర్డు యూనిట్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా జి.వి.రమణా రెడ్డి, ఉపాధ్యక్షులుగా సిహెచ్. సంజీవరెడ్డి, కార్యదర్శి గా ఆర్. జగదీశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా ఏ.రామ్‌కుమార, ఎం.ప్రణయ్, కోశాధికారి ఆర్.రఘు రాంకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆజ్మీరరాంబాబు,మహమ్మద్ అబ్దుల్‌సలీం, కార్య నిర్వాహక సభ్యులుగా మొహమ్మద్ అబ్దుల్ ముక్తదీర్,జె.సాయివర్ధన్, జె.సాయివర్ధన్, మొహమ్మద్ రహీం, భాగ్యలక్ష్మి,బి.వెంకటేశ్వర్లు,కె.నిరంజన్‌రెడ్డి,మహమ్మద్ సజావుద్దీన్, సి.మల్లేష్ ఎలక్షన్ ప్రొసిడింగ్ కాపిని అందచేశారు.ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కె.ఆర్.రాజ్ కుమార్,వైదిక్‌శాస్త్రి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈసందర్భంగా హౌజింగ్‌బోర్డు నూతన కార్యవర్గం ప్రతినిధులు జిల్లా అద్యక్షులు డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్ హుస్సేనీ,కార్యదర్శి విక్రమ్‌కుమార్‌లను శాలువ కప్పి సన్మానించారు.

ఎస్సీ వర్గీకరణకై ఉద్యమిద్దాం

ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంఎస్‌పి,

విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వారికే ఓటు వేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ప్రదర్శన చేస్తున్న బాలలహక్కుల పరిరక్షణ వేధిక

కంటోన్మెంట్,నవంబర్ 4 ప్రభాతవార్త: అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో పిల్లల ఎజెండా విద్యార్థుల హక్కులను మర్చిపోయారని, వారిని ఆధుకునే వ్యక్తులకు మాత్రమే ఓటు వేయాలని కోరుతూ శనివారం అడ్డగుట్ట డివిజన్‌లోని అజాద్ చంద్రశేఖర్ నగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద బాలలహక్కుల పరిరక్షణ వేధిక తల్లుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మి నారాయణ, మండల కన్వీనర్ ప్రవీణ్ కుమార్, నాయకులు మహేందర్, జమునా, రామలీలా, లక్ష్మి, పుష్పా, రబ్బానీ,ప్రకాశ్, సువర్ణ, భాగ్య పాల్గొన్నారు.

నిజాంపేట్‌లో బిఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం



కరపత్రాలను విడుదల చేస్తున్న మేయర్ కోలన్ నీలా గోపాల్‌రెడ్డి

నిజాంపేట్, నవంబర్ 4, ప్రభాతవార్త : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి కెపి వివేకానంద గౌడ్ విజయాన్ని కాంక్షిస్తూ శనివారం మేయర్ కోలన్ నీలా గోపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి ఎన్ఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, కార్పోరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ప్రజా ప్రతినిధులుతో కలిసి నిజాంపేట్ గాయత్రి టవర్స్ వద్ద భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కెపి వివేకానంద నాయకత్వాన్ని బలపరుస్తూ ముచ్చటగా మూడోవసారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి బిఆర్ఎస్ కార్పోరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఎన్ఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు, ఆయా డివిజన్ అధ్యక్షులు, అనుబంధ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళా నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో బిఆర్ఎస్‌కు ఓటు వేయాలి : నర్సింహ్మా ముదిరాజ్

బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితను గెలిపించాలని రెజిమెంటల్ బజార్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నర్సింహ్మా ముదిరాజ్ తదితరులు

అడ్డగుట్ట,నవంబర్ 4 ప్రభాతవార్త: కంటోన్మెంట్‌లో బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితను గెలిపించేందుకు కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ జిహెచ్ఎంసి మాజీ కో-ఆప్ షన్ సభ్యుడు నర్సింహ్మా ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం మోండా డివిజన్‌లోని రెజిమెంటల్ బజార్, గండి మైసమ్మ దేవాలయం పరిసర ప్రాంతాల్లోని అపార్ట్ మెంట్లు,కాలనీలు, బస్తీల లో పాదయాత్రలు నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అశోక్, నీలాంకర్, గోపి, సతీష్, రామక్రిష్ణ, ప్రవీణ్, క్రిస్టోఫర్, సందీప్, కాశిరెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి, నవంబరు 4 ప్రభాతవార్త: తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, సోనియాగాంధీ నేతృత్వంలోనే అది సాధ్యమైందని, ప్రజలందరు ఇది గమనించి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.అంజన్ కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. రామ్‌నగర్ డివిజన్‌లోని బాకారం బొమ్మలగుడి నుంచి ప్రారంభమైన పాదయాత్ర లక్ష్మీటవర్, శివస్థాన్‌పూర్, అభ్యుదయ నగర్, పద్మశాలీసంఘం, రెడ్‌కాన్వెంట్ స్కూల్, హరినగర్ తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు కల్పనాయాదవ్, వాజీద్‌హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు అమ్‌జద్ హుస్సేన్, బీసీ.వెంకటేశ్‌గౌడ్, అనీల్‌యాదవ్, సందీప్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, అంజిరెడ్డి, ఆవుల లోకేష్‌యాదవ్, సురేందర్‌రావు, బబ్లూయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాటేదాన్‌లో దీపావళి సమ్మేళనం

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,సీనియర్ బిఆర్ఎస్ నాయకులు రాజేష్ కుమార్ అగర్వాల్,వ్యాపారులు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబరు 4 ప్రభాతవార్త : కాటేదన్‌లోని శ్రీ మాత మందిరంలో శనివారం కాటేదన్ ఇండస్ట్రియల్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో దీపావళీ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసన సభ్యులు టి.ప్రకాష్ గౌడ్,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజేష్ కుమార్ అగర్వాల్, కాటేదన్ ఇండస్ట్రియల్ వ్యాపారులు శివ కుమార్ గుప్తా,విమలేష్ గుప్తా,అరుణ్ డకోటియా,రాకేష్ జలాన్‌తో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్ణయాలకు కట్టుబడి ఉంటాం

సికింద్రాబాద్ టీడీపీ

బౌద్ధనగర్‌లో సమావేశమైన టీడీపీ నేతలు

